



# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 08-06-2024 సంపుటి : 06 సంచిక : 267 పేజీలు : 8 వెల : రూ 3-00



## 'ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ'..

# మిత్రపక్షాల నేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక..







న్యూ ఢిల్లీ జూన్ 7, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. పవన్ అంటే పవన్ కాదు ఒక తుఫాన్ అన్నారు. ఏపీలో చంద్రబాబు చారిత్రాత్మక విజయం సాధించారన్నారు.పవన్ వల్లే ఏపీలో భారీ విజయం లభించిందని కీర్తించారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మోదీ ప్రసంగించారు. ముందుగా ఎన్డీయే మిత్రపక్షాల కార్యకర్తలకు శిరసువంచి నమస్కరిస్తున్నానన్నారు మోదీ. ఎన్డీయే గెలుపుకు శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు. ఇవాళ పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్డీయేపక్ష నేతగా నరేంద్రమోదీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మోదీ పేరును రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదిస్తే అమిత్‌షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. ఎన్డీయేపక్ష నేతగా 3వ సారి ఎన్నికైన నరేంద్రమోదీ.. ప్రధానిగా సేవలు అందించబోతున్నారు. ఎన్డీయే పక్ష సమావేశానికి హాజరైన మోదీ.. రాజ్యాంగానికి ప్రణామం చేసి ఉద్వేగంగా కనిపించారు. ఆ తరువాత పార్లమెంటరీ పక్షనేతగా ప్రసంగించిన మోదీ కార్యకర్తలను ఆకాశానికి ఎత్తేశారు. 22రాష్ట్రాల్లో ఎన్డీయే మిత్రపక్షాలు కలిసి ఉన్నాయన్నారు. విశ్వాసం అనే బంధం తమను కలిపిందని అన్నారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేసి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తల గురించి ఎంతచెప్పినా తక్కువే అవుతుందన్నారు. అయితే ప్రభుత్వం నడపడానికి అందరి సహకారం అవసరం అన్నారు. అందుకే మిత్రపక్షాల మద్దతు తీసుకున్నానన్నారు.గోవా, ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు ఎక్కువగా ఉన్నారన్నారు. తనపై నమ్మకంతో దేశ బాధ్యతలు అప్పగించారన్నారు. భారత స్ఫూర్తికి మన ఎన్డీయే కూటమి ఉదాహరణ అన్నారు.ఎన్డీయే అనేది భారతదేశపు ఆత్మ అని కొనియాడారు. ఎన్నికలకు ముందే కూటమి గట్టి విజయం సాధించడం ఒక గొప్ప చరిత్ర అన్నారు. ఇవి నాకు భావోద్వేగ క్షణాలని వివరించారు. ఏపీలో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక విజయం అందించారన్నారు. తెలుగురాష్ట్రాల్లో ప్రజలు ఎన్డీయేని బలపరిచారని చెప్పారు. గెలుపును ఎంత ఆస్వాధిస్తామో, పరాజితులను కూడా అంతే గౌరవిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇండియా కూటమి నేతలను విమర్శించారు. తమిళనాడులో ఎన్డీయే కూటమికి సీట్లు రాకపోవచ్చు.. అక్కడ ఏం జరుగుతుందో ముమ్ముందు ఉంటుందని చెప్పారు. ఇక విజయం సాధించి ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఆదివాసీలు అధికంగా ఉన్న 10 రాష్ట్రాల్లో ఎన్డీయేకు అత్యధిక స్థానాలు ఇచ్చారన్నారు. అలాగే ఆదివాసీలు ఎక్కువగా ఉన్న 7 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు.

# చంద్రబాబు ప్రమాణానికి చురుకుగా ఏర్పాట్లు

**12న మంగళగిరిలోనే ప్రమాణ కార్యక్రమం**
**మోడీ సహా పలువురు ప్రముఖుల రాక**
**మంత్రివర్గ కూర్పుపై త్వరలోనే బాబు చర్చలు**
**స్పీకర్ పదవి కోసం పలువురు నేతల పోటీ**





అమరావతి,జూన్7(: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నెల 12వ తేదీన కొలువుదీరనుంది. ఇందుకోసం మంగళగిరిలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. వర్షం పడే ఛాన్స్ ఉండడంతో అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని మోడీ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ రోజే కొందరు మంత్రులుగా ప్రమాణం చేసే అవకాశం ఉంది. అయితే ఎవరెవరు మంత్రులన్నది బాబు ఢిల్లీ నుంచి వచ్చిన తరవాత నిర్ణయించనున్నారు. ఇందులో ప్రధానంగా లోకేశ్, యనమల రామకృష్ణుడు, అచ్చన్నాయుడు, నారాయణ, తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. బిజెపి, జనసేనల నుంచి ఎవరన్నది కూటమి నేతల చర్చల్లో తేలనుంది. ఇదిలావుంటే స్పీకర్ పదవి కూడా కీలకమే కావడంతో పలువురు దీనికోసం పట్టుబట్టే అవకాశం ఉంది. స్పీకర్ పదవిపై మాత్రం సస్పెన్స్ వీడటం లేదు. స్పీకర్ పోస్ట్ కోసం ముగ్గురు, నలుగురు పోటీ పడుతున్నారు. జనసేన కోరుకుంటే నాదెళ్లకు ఆ పదవి దక్కవచ్చు. ఇకపోతే శాసనసభ వ్యవహారాలపై పట్టున్న నేతనే ఎన్నుకునే అవకాశం ఉంది. అయితే స్పీకర్ పదవి కోసం పోటీ పడుతున్న వారిలో ప్రముఖంగా వినిపిస్తోన్న పేరు రఘురామ కృష్ణరాజు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2019 ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. తొలి నుంచి వైసీపీ, జగన్ లక్ష్యంగా విమర్శలు చేయడంతో టా÷గ్గ÷ట్ అయ్యారు. అందుకోసమే నాలుగున్నరేళు ఢిల్లీలో ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. అక్రమ కేసు బనాయించి రఘురామను వైసీపీ ప్రభుత్వం అరెస్ట్ చేయించింది. ఆ తర్వాత టీడీపీలో చేరి, ఉండి నుంచి పోటీ చేసి, గెలుపొందారు. తనకు స్పీకర్ పదవి కావాలని టీడీపీ అధినేత చంద్రబాబును రిక్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. రఘురామ తర్వాత ప్రముఖంగా వినిపిస్తోన్న పేరు కళా వెంకట్రావు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సారి చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణను మట్టి కరిపించారు. తనకు స్పీకర్ పదవి కావాలని కళా వెంకట్రావ్ అడుగుతున్నారని తెలిసింది.కళా వెంకట్రావు తర్వాత మరొకరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సీనియర్ నేత ఆనం రాంనారాయణ రెడ్డి స్పీకర్ పదవిని ఆశీసున్నారు. ఆత్మకూరు నుంచి పోటీ చేసిన రాం నారాయణ రెడ్డి మేకపాటి విక్రమ్ రెడ్డిపై 7 వేల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు.

## సిఎస్‌గా బాధ్యతలు చేపట్టిన నీరభ్ కుమార్

**పూనం మాలకొండయ్య తదితరుల బదిలీ**



అమరావతి,జూన్7: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి నీరభ్ కుమార్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. 1987 బ్యాచ్‌కు చెందిన ఆయన.. ప్రస్తుతం రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు సీఎస్‌గా ఉన్న కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో నూతన సీఎస్ నియామకం జరిగింది. కొత్త సీఎస్ నియమాకం జరిగినందున జవహర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ వెంటనే ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. బుధవారం ఉదయం తెదేపా అధినేత చంద్రబాబును నీరభ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి వెళ్లారు. ఈ క్రమంలోనే సీఎంవోలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తా ఈ ముగ్గురు ఐఏఎస్ అధికారులు జీఏడీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో వైపు నూతన సీఎస్‌గా నియమితులైన నీరభ్ కుమార్ ప్రసాద్ సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో బాధ్యతలు చేపట్టారు.

## ఓడినా తిరుపతి ప్రజల సేవలో ఉంటా

**మాజీ ఎంపి, బిజెపి నేత వరప్రసాద్**

తిరుపతి,జూన్7: ఓటమి చెందినా తన వంతుగా తిరుపతి పార్లమెంటు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ నేత, మాజీ ఎంపీ వరప్రసాద్ అన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని వరప్రసాద్ అన్నారు. చాలా తక్కువ మెజారిటీతో ఓడిపోయానన్నారు. తాను ఎంపీగా ఉండగా.. జగన్ తన సలహాలు పాటించారని బీజేపీ నేత, మాజీ ఎంపీ వరప్రసాద్ తెలిపారు. సీఎంగా గెలుచిన తరువాత జగన్ బాగా మారిపోయారన్నారు. రెడ్డి సామాజిక వర్గంలో ధనంజయరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల మిథున్ రెడ్డి వల్లనే వైసీపీని వీడాల్సి వచ్చిందన్నారు. వైసీపీలో సొంత పార్టీ వారిపై కేసులు పెట్టించిన ఘనత సజ్జలదేనని పేర్కొన్నారు. సిలికా, ఇసుకా అక్రమ రవాణాను అడ్డు కోవడం వారికి తప్పుగా కన్పించిందని వరప్రసాద్ తెలిపారు. రిటైర్ ఐఏఎస్ అధికారిగా తనకు పాలనపై అవగాహన ఉందన్నారు. అక్రమాలను అడ్డుకున్న కారణంగా వైసీపీలో టిక్కెట్ దక్కుతుందని భావించలేదన్నారు. ప్రజలకు సేవ చేయాలని చంద్రబాబు, మోదీ ఆలోచనలు నచ్చి బీజేపీలో చేరి టికెట్ పొందానని వరప్రసాద్ వెల్లడించారు. సహజ వనరులు దోచుకున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి, మిథున్ రెడ్డిలపై జగన్‌కు పిర్యాదు చేసినా ఎలాంటి చర్య తీసుకులేదన్నారు. వెనకబడిన వర్గాల అభిప్రాయాలను గౌరవించే స్వభావమే జగన్‌కు లేదన్నారు.


## 12న సిఎంగా చంద్రబాబు ప్రమాణం

**ఏర్పాట్లను పరిశీలించిన అచ్చన్నాయుడు**

అమరావతి,జూన్7: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి భారీ విజయంతో ఈనెల 12న టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. మెదట జూన్ 9న ప్రమాణ స్వీకారం ఉంటుందని వార్తలు వచ్చినప్పటికీ ఆరోజున మోడీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనుండడంతో తేదీని మార్చాల్సి వచ్చింది.మంగళగిరి ఎయిమ్స్ సమీపంలో సభ నిర్వహిస్తే అందరికీ అనువుగా ఉంటుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ముఖ్య నేతలతో కలిసి ఇవాళ స్థల పరిశీలన చేయనున్నారు. కార్యక్రమానికి మోడీ కూడా హాజరుకానున్న నేపథ్యంలో హైవే పక్కనే స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు టీడీపీ నేతలు చెప్తున్నారు.

# టీచర్ల బదిలీలపై నిరాధార ఆరోపణలు

**లంచాలు తీసుకున్నారని దుష్ప్రచారం**
**ప్రకటన విడుదల చేసిన మాజీమంత్రి బొత్స**



విజయనగరం,జూన్7: టీచర్ల బదిలీలపై నిరాధార ఆరోప ణలు చేస్తున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బదిలీల కోసం బొత్స లంచాలు తీసుకున్నారని ఆరోపణలు వస్తున్న అంశంపై ఓ ప్రకటన విడుదల చేశారు. ష్ట్రంలోని పాఠశాల విద్యా శాఖ పరిధిలో గతంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయం, దరిమిలా దానిపై ఆరోపణలతో పత్రికలు వార్తాంశాలు ప్రచురించా యన్నారు. తనపై వ్యక్తిగతమైన ఆరోపణలు చేస్తూ ప్రచురితమైన వార్తాంశాలు పూర్తిగా అవాస్తవం, అభూత కల్పనలతో నా వ్యక్తిత్వ హననానికి చేస్తున్న ప్రయత్నం తప్ప మరొకటి కాదని చెప్పుకొచ్చారు.ఎన్నికలకు ముందు నుంచీ కూడా ఇవే ఆరోపణలతో అనేక సార్లు వార్తలు ప్రచురించాయని గుర్తు చేశారు. అప్పుడే ఖండించిన విషయాలను మీకు గుర్తు చేస్తున్నాను.ఇప్పుడు మరోసారి ఖండిస్తున్నాను, గర్హిస్తున్నానన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు తమ ఆరోగ్య, కుటుంబ ఇతరత్రా ఇబ్బందులు, వివిధ వ్యక్తిగత సమస్యల రీత్యా బదిలీలు కోరుకుంటూ ఆర్జీ పెట్టుకోవడం జరిగింది. వాటిని పూర్తి పారదర్శకంగా పరిశీలించి క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకున్న తరువాతనే అప్పట్లో నిర్ణయం తీసుకోవడమైందన్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే ఈ బదిలీలు నిలిపేయాల్సిందిగా సంబంధిత అధికారులను తానే స్వయంగా కోరడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం వస్తున్నందున ఈ విషయంలో వారు తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవచ్చు. బదిలీల కోసం అర్జీచేసుకున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిగణలోకి తీసుకుంటారా? లేదా? అన్నది కొత్త ప్రభుత్వం ఇష్టం. వాస్తవాలు ఇలా ఉంటే బదిలీలకోసం లంచాలు తీసుకున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. అలాంటి తప్పుడు పనులు చేయాల్సిన అగత్యం, అవసరం మాకు లేవని చెప్పుకొచ్చారు. దాదాపుగా పదిహేను వందల మంది ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు బదిలీలు చేపట్టారు. వారి వద్ద నుంచి పెద్ద ఎత్తన నగదు తీసుకన్నారని ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ ఓడిపోవడంతో మంత్రిగా బొత్స పదవి కూడా పోయింది. అయితే బదిలీలు మాత్రం జరగలేదు. దీంతో డబ్బులు ఇచ్చిన ఉపాధ్యాయులు ఆందోళనకు సిద్ధమవతు?న్నారు. డబ్బులు ఇచ్చినా బదిలీలు జరగలేదని ధర్నాకు సిద్ధమయ్యారన్న ప్రచారం జరుగుతోంది.

# మూడు రాజధానులకు ప్రజలు..నో

గుంటూరు, జూన్ 7, ఎన్నికల్లో జగన్ రికార్డు సృష్టించారు. దేశమంతా ఏపీ వైపు చూసేలా దిమ్మతిరిగే విజయం సాధించారు. 2024 ఎన్నికల్లోను రికార్డును కొనసాగించారు. అయితే అది విజయం గా కాదు.. ఓటమిలో. గత ఎన్నికల్లో చరిత్రలో మరెవ్వరూ సాధించరేమో అన్నంత రీతిలో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇప్పుడు చరిత్రలో మరెవ్వరూ ఇంతలా ఓటమి చెందరేమో అన్న రీతిలో ఘోర పరాజయం పొందారు. 151 సీట్లు సాధించిన వైసిపి.. ఈసారి 164 సీట్లు కోల్పోయింది. 2019లో ఆయనపై జనం నమ్మకం పెట్టుకోగా.. ఇప్పుడు ఆ నమ్మకం ఎటో వెళ్లిపోయింది. ఆ విశ్వాసం కరిగిపోయింది. నేను చేసిన మేలు, ఇచ్చిన పథకాలు ఎటు వెళ్లిపోయాయి అంటూ జగన్ నిర్వేదం వ్యక్తం చేసేదాకా పరిస్థితి వచ్చింది.అమరావతి రాజధాని అంశం ఎక్కువగా ప్రభావం చూపింది. ఆ రెండు జిల్లాలే సరి కదా.. ఏం జరుగుతుంది లే అన్న ధీమా మూల్యానికి కారణమైంది. పోనీ మూడు రాజధానులకైనా ముందడుగు పడిందంటే అదీ లేదు. రాజధాని లేని రాష్ట్రం గా ఏపీ అవతరించింది. అమరావతి స్మశానమైంది. కాదు కాదు అలా మంత్రులు ప్రకటించారు. మూడున్నర సంవత్సరాలుగా అమరావతి రైతుల ఆర్తనాధాలను ప్రజలు చూశారు. తమ సొంత ప్రాంతానికి రాజధాని వస్తుందంటే ఉత్తరాంధ్రులు స్వాగతించలేదు. తమ నుంచి రాజధానిని దూరం చేశారని రాయలసీమ వాసులు ఆక్రయించారు. మూడు ప్రాంతాల ప్రజలు అమరావతి విషయంలో వైసీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని ముక్తకంఠంతో ఖండించారు. తమ ఓటుతో బుద్ధి చెప్పారు.రాష్ట్ర ప్రజలకు ఎంతో మంచి చేశాను అన్నది జగన్ వాదన. ఒకవిధంగా చెప్పాలంటే వర్ణించలేని బాధ కూడా. జనాన్ని మోసం చేసిన నాయకులు ఉన్నారు కానీ.. జనం చేతిలో మోసపోయింది తానే అన్నట్టు జగన్ ప్రకటించడం ఆయన నిస్సహాయ స్థితికి కారణం. ఆ పరిస్థితి కూడా ఆయనే కారణం. ఆయన స్వయంకృతాపం. ప్రధానంగా జనం భయపడ్డారు. జగన్ పాలనలో కొంత అయితే.. విపక్షాల దుష్ప్రచారంతో మరికొంత. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఎవరేం చేస్తారో నన్న భయం ప్రజలను వెంటాడింది. అందుకు తగ్గట్టుగానే మాట్లాడిన వారికి సిఐడి పట్టుకెళ్ళింది. విపక్ష నేతలపై ఉక్కు పాదం మోపింది. అరెస్టుల ప్రభావం కూడా సామాన్య జనాల్లో భయానికి కారణం అయ్యింది.సంక్షేమ పథకాలు ఇస్తేనే సరిపోదు.



అభివృద్ధి కూడా కావాలి అన్నది ప్రజల అభిమతం. మాట తప్పుడు మడమ తిప్పుడు అన్న మంచి పేరు జగన్ పై ఉన్నా.. ప్రత్యేక హోదా విషయంలో మాట తప్పారు. మధ్య నిషేధ విషయంలో మాట తప్పరు. సిపిఎస్ రద్దు పైన మాట తప్పారు. ఈ మూడు సహేతుక కారణాలు చాలు జగన్ ఓటమికి. సంక్షేమ పథకాలమాటున ఈ మూడు హామీలు కొట్టుకుపోతాయని జగన్ భావించారు. కానీ అవే విశ్వరూపం చూపాయి. ప్రజల్లో ఆగ్రహానికి కారణం అయ్యాయి.మేము నగదు పంచాం. చెప్పేందుకు వాలంటీర్లు ఉన్నారు. మాకంటూ ప్రత్యేక ఓటర్లు ఉన్నారు.. ఇలా ఏవేవో చెప్పుకొని సొంత పార్టీ మనుషులను నమ్మలేదు. ప్రాధాన్యం ఇవ్వలేదు. పైగా అధినేతను కలవాలంటే కట్టడి. అపాయింట్మెంట్ దొరకాలంటే అతి కష్టం. ఇటువంటి అంశాలన్నీ అధికార పార్టీ నేతల్లో అసంతృప్తికి దారితీసాయి.తామే అభ్యర్థులం అన్న రీతిలో గత ఎన్నికల్లో వైసీపీ శ్రేణులు గట్టిగానే పోరాడాయి. కానీ అధికారంలోకి వచ్చాక వాలంటీర్లే అన్ని అయ్యారు. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. అసలు ఎమ్మెల్యేలే ఉత్సవ విగ్రహాలుగా మారారు అన్న ఆరోపణలు వచ్చాయి.ఇవన్నీ ఓటమికి కారణాలే.

ప్రజా అంగీకారం లేదు – అమర్ నాథ్

ఏపీలో వైసీపీకి దారుణ పరాజయం ఎదురయ్యింది. అక్కడా ఇక్కడా అన్న తేడా లేదు. అన్నిచోట్ల అదే పరిస్థితి. కొన్ని జిల్లాల్లో అయితే వైట్ వాష్ చేసింది. ఉత్తరాంధ్రలో అయితే రెండు స్థానాలకు పరిమితం అయ్యింది. దీంతో రకరకాల అంశాలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా మూడు రాజధానులకు ప్రజలు హర్షించలేదని స్పష్టమైంది. రాజధాని ప్రతిపాదిత ప్రాంతంలో కూడా ప్రజలు మద్దతు తెలపలేదు. అమరావతిలో కూడా ఆదరణ దక్కలేదు. దీంతో వైసీపీలోనే రాజధాని అంశంపై స్వరం మారుతోంది.2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి రాజధానిని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. దాదాపు 33 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దాదాపు 7వేల కోట్లతో వివిధ నిర్మాణ పనులు కూడా ప్రారంభం అయ్యాయి. ప్రపంచానికి తలమానికంగా అమరావతి రాజధాని నిర్మిస్తామని నాడు చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే పనులు జరుగుతుండగానే 2019 ఎన్నికలు వచ్చి పడ్డాయి. ఆ ఎన్నికల్లో టిడిపి ఓడిపోవడం, వైసిపి అధికారంలోకి రావడం చకచకా జరిగిపోయాయి. ఇలా అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి సర్కార్ అమరావతి పై విషం చిమ్మింది. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అప్పటినుంచి అమరావతి ఉద్యమం ప్రారంభమైంది. పతాక స్థాయికి చేరుకుంది. ప్రభుత్వం నుంచి ఉక్కు పాదం ఎదురయ్యింది. అలాగని మూడు రాజధానుల అంశం సైతం పురుడుబోసుకోలేదు. ఇవన్నీ రాష్ట్ర ప్రజల్లో ఆగ్రహానికి కారణం అయ్యాయి. విశాఖపట్నం ప్రజలు కూడా ఆహ్వానించలేదు. అదే సమయంలో అమరావతికి వేదికగా నిలిచే గుంటూరు, కృష్ణాజిల్లాలో సైతం వైసీపీకి ప్రాతినిధ్యం దక్కలేదు. రెండింటికి చెడ్డ రేవడిగా మారింది వైసీపీ పరిస్థితి.ఈ ఎన్నికల్లో గెలిస్తే విశాఖ నుంచి ప్రమాణస్వీకారం చేస్తానని జగన్ ప్రకటించారు. జూన్ 9న ప్రమాణ స్వీకారానికి వైసీపీ నేతలు ఏర్పాట్లు కూడా ప్రారంభించారు. అదే రోజున విశాఖలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్టు బుక్ అయ్యాయని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తద్వారా విశాఖ రాజధాని అని ముందుగానే సంకేతాలు పంపించారు. కానీ వారు అనుకున్నది ఒకటి.. అయ్యింది ఒకటి అన్న పరిస్థితి తయారయ్యింది. కనీసం ప్రజలు ఆహ్వానించలేదు. వైసీపీని ఆదరించలేదు. దారుణంగా తిరస్కరించారు. ఈ ఎన్నికలు రాజధానికి రెఫరండంగా తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు విశాఖ రాజధానిని ఆహ్వానించలేదని చెప్పుకొచ్చారు. ఓటమి పై పోస్టుమార్టం చేస్తామని.. ఎక్కడలోపం జరిగిందో తెలుసుకుంటామని ప్రకటించారు.మొత్తానికైతే రాజధానుల విషయంలో తప్పు జరిగిందని వైసీపీ నేతలు ఒప్పుకోవడం విశేషం.

## జగన్ నివాసానికి వెళ్లిన అమరావతి రైతులు

అమరావతి,అమరావతి రైతులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లారు. జగన్ నివాసం గాంధీగిరి చసారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు మా గోడు వినలేదు.. ఎమ్మెల్యేగా అయినా వింటారని వచ్చామని అన్నారు. కూటమి విజయానికి పరోక్షంగా సహకరించిన జగన్ కి ధన్యవాదాలు చెబుదామని వచ్చామని అన్నారు. జగన్ వల్లే ఉ ద్యమాలు

చేయడం నేర్చుకున్నాం. ఇంట్లో ఉండి గరిటెలు తిప్పే తమకు జెండాలు పట్టుకుని ఉద్యమాలు చేయడం నేర్పిన ఘనత జగన్దేన్న మహిళా రైతులు అన్నారు. జగన్ ను కలిసి స్వీట్స్, మామిడి, అరటి పండ్లు, తాంబూలం ఇచ్చేందుకు వచ్చామన్న మహిళా రైతులు వెల్లడించారు. భద్రతాసిబ్బంది వారిని అనుమతి లేకుండా లోపలకు పంపించేది లేదని ఆపివేసారు. సెక్యూరిటీ సిబ్బందితో రాజధాని మహిళా రైతుల వాగ్వాదానికి దిగారు. అరగంటపాటు జగన్ అపాయింట్ మెంట్ కోసం వేచివున్న రైతులు, స్పందన రాకపోవడంతో వెనుదిరిగారు.

# ఏపీకి మంచి రోజులు వచ్చినట్టేనా

గుంటూరు, జూన్ 7, ఏపీలోలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద విజయాన్ని తెలుగుదేశం పార్టీ ఖాతాలో వేసుకుంది. ఇదే సమయంలో కేంద్రంలోనూ కీలకంగా మారిపోయింది. ఎన్డీయే కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా టీడీపీ అవతరించింది. 16 ఎంపీ స్థానాలతో బలమైన శక్తిగా మారింది. దీంతో కేంద్రంలో మళ్లీ చంద్రబాబు పావులు కదిపే సువర్ణ అవకాశం లభించిందన్న విశ్లేషణలు జోరుగా వినిపిస్తున్నాయిఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నాయి. గతంలో ఉన్న జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం?.పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పెద్దగా పరిష్కరం కాలేదు. అయితే ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో?.. చంద్రబాబు కేంద్రంలో అత్యంత కీలంగా మారారు.బీజేపీకి పూర్తిస్థాయి మెజార్టీ రాకపోగా? భాగస్వామ్యపక్షాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందులో నితీశ్ కుమార్, చంద్రబాబు కీలకంగా మారారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు?. ఏపీకి సంబంధించి పలు ముఖ్య అంశాలపై దృష్టిసారించి?.త్వరితగతిన కేంద్రం నుంచి పరిష్కారం రాబట్టే అవకాశం కనిపిస్తోంది. ఇందులో కొన్ని అంశాలను చూస్తే?2014 జూన్ నుంచి మూడేళ్లపాటు తెలంగాణ రాష్ట్రానికి ఏపీ జెన్కో విద్యుత్ సరఫరా చేసింది. దీనికి సంబంధించిన రూ.7,230 కోట్ల బకాయిలు పెండింగ్లో ఉన్నాయి. వెంటనే చెల్లించేలా కేంద్రం తరపున తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవచ్చే అవకాశం చంద్రబాబుకు ఉంటుంది.పోలవరం ప్రాజెక్ట్ కు రావాల్సిన నిధుల విషయంలో త్వరితగతని అడుగులుపడే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో ఏఏ శాఖల వద్ద ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయో?. ఆయా శాఖలతో మాట్లాడి పనులను మరింత స్పీడ్ చేసే ఛాన్స్ ఉంటుంది.రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా సహా మరికొన్ని హామీల అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.అమరావతి పనులు మళ్లీ వేగవంతం కావటంతో కేంద్రం నుంచి నిధులు రాబట్టే అవకాశం ఉంది.కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులతో పాటు తగిన సహాయ సహకారాలపై చర్చించే అవకాశం ఉంటుంది.భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖపట్నం పోర్టులను కలిపే ఆరు లేన్ల రహదారి పనులు వేగవంతంతో పాటు మరికొన్ని జాతీయ ప్రాజెక్టులపై ఫోకస్ చేసే అవకాశం ఉంటుంది.విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా ఆమోదం తెలిపేలా కేంద్రాన్ని ఒప్పించే అవకాశం ఉంటుంది.ఇవేకాకుండా?. అమరావతి రాజధానితో పాటు ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ప్రతి అంశంపై కూడా ఏపీలోని చంద్రబాబు సర్కార్ ప్రధానంగా దృష్టిపెట్టే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాలపై స్పందిస్తున్న పలువురు విశ్లేషకులు?. చంద్రబాబు టైమ్ వచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు.ఏపీలోని 175 అసెంబ్లీ సీట్లకు గాను ఎన్డీఏ కూటమి 164 సీట్లలో విజయం సాధించింది. వైసీపీకేవలం 11 స్థానాలతోనే సరిపెట్టుకుంది. ఎన్డీఏ కూటమిలోని పార్టీలను చూస్తే? తెలుగుదేశం పార్టీ మొత్తం 144 స్థానాల్లో పోటీ చేయగా 135 స్థానాల్లో నెగ్గింది.జనసేన 21కి 21 స్థానాల్లో జెండా ఎగరవేసింది. బీజేపీ మొత్తం 10 చోట్ల పోటీ చేయగా.. 8 సీట్లలో గెలుపొందింది. పార్లమెంట్ స్థానాల్లో చూస్తే? టీడీపీ 16 ఎంపీ స్థానాలు, వైసీపీ 4, జనసేన 2, బీజేపీ 3 పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంది.

# నోరు తెచ్చిన తంటా....

విజయవాడ, జూన్ 7 నోరు మంచిదైతే.. ఊరు మంచిదవుతుంది. ఇది సామెత. ఇప్పుడీ వ్యాఖ్యలు పర్ఫెక్ట్గా సూటవుతాయి వైసీపీ నేతలకు. బూతులు మాట్లాడితేనే నేతలమవుతామనుకున్నారో.. లేక అధినేత మెప్పు కోసం మాట్లాడారో తెలీదు కానీ.. వారు మాట్లాడిన బూతులు.. కొట్టిన తోడలు.. తిప్పిన మీసాలు.. వైసీపీకి కోలుకులేని దెబ్బకు ఒక కారణమైందా? మంత్రుల నోటి దురుసే వైసీపీ ఇమేజ్ను డ్యామేజ్ చేసిందా ?వీరంతా అధికార వైసీపీ నేతలు. ఒకరు తప్ప అందరూ మంత్రులుగా పదవుల్లో కొనసాగిన వారే. ఇది వారి తీరు. అడ్డూ అదుపు లేదు? ఏం మాట్లాడుతున్నారో, ఏం ట్వీట్ చేస్తున్నారో సోయి లేదు.. ఎలాపడితే అలా నోరుజారారు. ప్రత్యర్థి పార్టీ నేత అయితే చాలు.. నోటికి ఎంత మాట వస్తే అంత మాటే. తిట్లు, బూతులు, శాపనార్థాలు.. ఇలా వీటిని ఓ బ్రాండ్గా మార్చేసిన వారిలో వీరి పాత్ర అస్సలు మరువలేం.నిజానికి విమర్శలు, ఆరోపణలు ప్రజాస్వామ్యంలో సహజం. బట్ మన పొలిటీషియన్లు ఆ రేంజ్ను దాటి పోయారు. బూతే మంత్రం, బూతే లోకం అన్నట్టుగా దూసుకెళ్లారు. ఇందులో విపక్ష నేతలు కూడా ఉన్నారు. వారిది కూడా తప్పే. బట్ అధికార పార్టీలో ఉండి.. అది కూడా కీలక పదవుల్లో ఉన్నప్పుడు మరింత బాధ్యత పెరుగుతోంది. మరింత జాగ్రత్త అవసరం. కానీ దానిని ఎవరూ పట్టించుకోలేదు. ఒకరిని మించి ఒకరు రెచ్చిపోయారు. ప్రజలు వింటున్నారు.. ఏమనుకుంటారో అనే స్పృహలేకుండా చెలరేగిపోయారు.ప్రజాసమస్యలపై కనీస అవగాహన ఉండదు. జనానికి పనికొచ్చే పనులు చేయాలని ఉండదు. మాటలతో మభ్యపెట్టి, బూతులతో లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు జనాల్ని భ్రమపెట్టే ప్రయత్నంలో నేతలు ముదిరిపోయారు. కానీ ప్రజలు కూడా మరింత తెలివిగలవారు అనే విషయాన్ని మరిచిపోయారు. ఈ గోలంతా చూసి, జనాలు మొదట నవ్వుకున్నారు. బూతుల పంచాంగం వినలేక ఆ తర్వాత విసిగిపోయారు. రాను రాను ఇది వారిపై.. అధికార పార్టీపై వ్యతిరేకతను పెంచసాగాయి. కానీ ఈ విషయాలను పార్టీ పెద్దలు కనిపెట్టలేకపోయారు. నేతలను కంట్రోల్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. ఒకానొక సమయంలో వారే ఈ నేతలను ఎంకరేజ్ చేస్తున్నారా? అనే డౌట్ కూడా ప్రజల్లో మొదలైంది.నిజానికి ఏపీలో పరిష్కారం కావాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. రోజురోజుకూ తమ కష్టాలు పెరుగుతున్నా.. వాటిని పట్టించుకుకోకుండా.. మీ పర్సనల్ పంచాయితీలేంటి అన్న భావన ప్రజల్లో మొదలైంది. ఆకరికి ప్రజలకు ఏదో ఒక మంచి పని చేసి ఎన్నికల్లో ఓట్లడగాలనే విషయాన్ని కూడా నేతలు మరిచారు. పక్క పార్టీని తిడితే చాలు ప్రజలు మళ్లీ పట్టం కడతారు అనుకున్నారు. అందుకే పాజిటివ్ ప్రచారం కంటే.. నెగటివ్ ప్రచారాన్నే ఎక్కువగా నమ్ముకున్నారు? బోల్తా పడ్డారు.ఏపీ మాజీ మంత్రి కొడాలి నానిని నిన్నటిదాకా బూతుల మంత్రి అంటూ టీడీపీ నేతలు సెటైర్లు వేశారు. అటు కొడాలి కూడా మంత్రి పదవిలో ఉన్నా, లేకున్నా ఎక్కడా తగ్గినట్టు కనిపించలేదు. అంబటి రాంబాబు సెటైర్లు.. అనిల్ కుమార్ యాదవ్ పంచ్లు.. రోజా వెటకారం.. ఇలానే సాగిపోయింది వైసీపీ పాలన.వైసీపీ పాలనతో శాసనసభ చరిష్మా కూడా పడిపోయిందనే చెప్పాలి. గతంలో ఆఫ్ ది రికార్డ్ లో ఎలా ఉన్నా, అసెంబ్లీ కాస్త పవిత్రంగా ఉండేవాళ్లు. ఇప్పుడు అక్కడ కూడా అతి చేయడం కామన్ అయిపోయింది. ఏ నేత మాటలకు బీప్ వేసుకోవాలో తెలియని పరిస్థితి.పార్టీల కీలక నేతలే ప్రత్యర్థులపై.. నోరు పారేసుకుంటుంటే? కింది స్థాయి నేతలు, కార్యకర్తలు కూడా అలాంటి భాషే వాడుతారు. వాడారు కూడా. దీంతో మొత్తం వాతావరణమే రచ్చ రచ్చగా మారింది. నేతల బూతు పురాణంతో ప్రజా సమస్యలు మరుగున పడిపోయాయి.. ప్రత్యర్థుల్ని తిట్టడం మీద ప్రజా ప్రతినిధులు చూపించిన శ్రద్ధ కాస్తైనా ప్రజల మీద, వారి సమస్యల పరిష్కారం మీద చూపిస్తే.. ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు.సొసైటీలో రాజకీయ పార్టీలకు చాలా బాధ్యత ఉంటుంది. చట్టసభల్లో ఉండే సభ్యులకైతే అంతకు మించి ఉంటుంది. కానీ అలాంటి పవిత్ర బాధ్యతలో ఉన్నవాళ్లు.. ప్రజలు ఏమనుకుంటారో అనే భావనే లేకుండా.. నోరు పారేసుకోవడం రాజకీయాల్లో పైత్యానికి పరాకాష్టగా మారింది. అందుకే ప్రజల్లో ఓ ఏవగింపు మొదలైంది. అదే ఆ నేతలను ఇప్పుడు అధికారానికి దూరం చేసింది.

# మంత్రివర్గ రేసులో వీరేనా

విజయవాడ, జూన్ 7, ఏపీలో కూటమి విజయం సాధించటంతో ఎవరు మంత్రులు కాబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. కూటమిలో మూడు పార్టీలు భాగం కావటంతో? ఎవరిని అదృష్టం వరించబోతుందనే దానిపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సీనియారిటీ, కూటమిలోని పక్షాలకు ప్రయారిటీతో పాటు సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని మంత్రివర్గ కూర్పు ఉండబోతుందని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇందులో ఎన్డీఏ కూటమి 164 సీట్లలో విజయం సాధించింది. తెలుగుదేశం పార్టీ మొత్తం 144 స్థానాల్లో పోటీ చేయగా 135 స్థానాల్లో నెగ్గింది. అతిపెద్ద భాగస్వామ్యపక్షంగా టీడీపీ ఉంది. ఇక జనసేన 21కి 21 స్థానాల్లో జెండా ఎగరవేసింది. భారతీయ జనతా పార్టీ మొత్తం 10 చోట్ల పోటీ చేయగా.. 8 సీట్లలో గెలుపొందింది.ఇక పార్లమెంట్ స్థానాల విషయానికొస్తే మొత్తం 25 స్థానాలకుగాను టీడీపీ 16 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది.కూటమిలో ఉన్న జనసేన 2, బీజేపీ 3 పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంది. రాష్ట్రం నుంచి మెజార్టీ గెలుచుకున్న టీడీపీ?. అటు కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో రెండో అతిపెద్ద పార్టీ అవతరించింది. దీంతో కేంద్రంలోనూ తెలుగుదేశం పార్టీకి కీలక మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉంది.మంత్రులుగా ఎవరికి అవకాశం – రేసులో ఉన్నది ఎవరు??చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఏపీలో అధికార పీఠాన్ని అధిష్టించింది. జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. చంద్రబాబు కేబినెట్ లో మొత్తం 25 మందికి అవకాశం ఉంది. అయితే ఆ రోజు ఎంత మంది మంత్రులుగా ప్రమాణం చేస్తారనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది. పూర్తిస్థాయి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తారా లేక కొంతమందితో కూడిన కేబినెట్ కొలువుదీరుతుందా అనేది తెలియాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలిస్తే?

ప్రకాశం జిల్లా – వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, సాంబశివరావుతో పాటు మరో ఎమ్మెల్యే రేసులో ఉండే అవకాశం ఉంది.

నెల్లూరు జిల్లా – మాజీ మంత్రి నారాయణ, ఆనం రాం నారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్రెడ్డితో పాటు కోటంరెడ్డి పేరు కూడా పరిశీలించే అవకాశం ఉంటుంది.

చిత్తూరు జిల్లా – అమరనాథ్రెడ్డి, నల్లారి కిషోర్కుమార్ రెడ్డితో పాటు మరో ఎమ్మెల్యే పేరు కూడా పరిశీలించవచ్చు.

కృష్ణా జిల్లా – ఈసారి ఇక్కడ కూటమి క్లీన్ స్వీప్ చేసింది. దీంతో ఈ జిల్లాకు మంత్రివర్గంలో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వొచ్చు. బోండా ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి ఉన్నారు.

గుంటూరు జిల్లా – సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు,ధూళిపాళ్ల నరేంద్ర,, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

అనంతపురం జిల్లా – సీనియర్ నేతలైన పయ్యావుల కేశవ్, కాలువ శ్రీనివాసులు, పరిటాల సునీత రేసులో ఉన్నారు. వీరిలో ఇద్దరికి అవకాశం రావొచ్చు.

కర్నూలు జిల్లా –కోట్ల సూర్యప్రకాష్రెడ్డితో పాటు మరో పేరును పరిశీలించే అవకాశం ఉంది.

కడప జిల్లా – పుట్టా సుధాకర్ యాదవ్, భూమిరెడ్డి రాంగోపాల్రెడ్డితో పాటు మరో ఎమ్మెల్యే పేరును పరిశీలిస్తారని సమాచారం.

తూర్పు గోదావరి – సీనియర్ నేత అయిన యనమల రామకృష్ణుడు, చినరాజప్పతో పాటు జ్యోతుల నెహ్రూ పేరు పరిశీలించనున్నారు. ఇక 7వ సారి ఎమ్మెల్యేగా గెలిచిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

పశ్చిమ గోదావరి – బీసీ సామాజికవర్గానికి చెందిన పితానితో పాటు నిమ్మల రామానాయుడు పేరు పరిశీలించే అవకాశం ఉంది.

శ్రీకాకుళం – అచ్చెన్నాయుడకు దాదాపుగా ఛాన్స్ ఉంటుంది. ఇక కూన రవికుమార్ పేరు పరిశీలనలో ఉంది.

విజయనగరం – కళా వెంకటరావుతో పాటు మరో ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి.విశాఖ – అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు కేబినెట్ రేసులో ఉంటారు. పల్లా ఈసారి అత్యధిక మెజార్టీతో గెలిచారు.మంత్రివర్గం కూర్పులో జనసేన నుంచి పలువురికి అవకాశం దక్కే అవకాశం స్పష్టంగా ఉంది.

అయితే పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇస్తారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ? దీనిపై జనసేన వర్గాల నుంచి స్పష్టమైన సమాచారం లేదు. ఇదే పార్టీకి చెందిన నాదెండ్లకు దాదాపుగా బెర్త్ ఖరారయ్యే ఛాన్స్ ఉంది

# చిత్తూరులో ఎవరికి ఛాన్స్

తిరుపతి, జూన్ 7,ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 12 అసెంబ్లీ సీట్లు సాధించింది. పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి మినహా అన్ని సీట్లు కూటమి పాగా వేసింది. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసే క్రమంలో జిల్లాకు సంబంధించి ఎవరికి మంత్రి పదవి అనే దానిపై విస్తృతంగా చర్చ నడుస్తోంది.జిల్లాకు సంబంధించి పలమనేరు ఎమ్మెల్యే గా గెలుపొందిన అమర్నాథ్ రెడ్డి కి మంత్రి పదవి వారించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. తొలుత టీడీపీ నుంచి వైసీపీ పార్టీలో కి వెళ్లారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొంది టీటీడీ పార్టీలో చేరారు. అప్పట్లో ఆయనకు మంత్రి పదవి చంద్రబాబు నాయుడు ఇచ్చారు. తరువాత 2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2014లో పార్టీలో చేరిన నాటి నుండి పార్టీని జిల్లా వ్యాప్తంగా తన బుజాల పై వేసుకుని నడిపించారు. చంద్రబాబు, లోకేష్ పాదయాత్ర సహా టీడీపీ ని 10 సంవత్సరాలు పాటు అనేక కష్టాలు ఇబ్బందుల్లో నడిపించారు. గతంలో చేసిన అనుభవాల దృష్ట్యా ఆయనకు మంత్రి పదవి వచ్చే అవకాశం ఉంది.జిల్లాకు సంబంధించి కుటుంబ పరంగా మరో కీలక నాయకుడు పీలేరు ఎమ్మెల్యేగా గెలిచిన నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి. ఆయన విజయాన్ని రెండు సార్లు పరీక్షించుకుని మూడో సైరి కూటమిలో భాగంగా టీడీపీ సీటు వరించింది. గతంలో కుటుంబం లోని తండ్రి, సోదరుడు చేసిన అభివృద్ధి కి మరింత తోడ్పాటు అందించాలంటే మంత్రి పదవి అనడంలో అతిశయోక్తి లేదంటున్నారు కానీ రాజకీయ సమీకరణాలు కలసి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. కుటుంబ వారసత్వానికి చెందిన మరో నాయకుడు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. ఆయన తాత, తండ్రి పార్టీలో విశేష కృషి చేశారు. తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి టీడీపీ పార్టీలో పుట్టి.. అక్కడే చివరి శ్వాస విడిచారు. ఆయన మంత్రి గా అనేక సార్లు అభివృద్ధి పదంలో దూసుకెళ్లేలా చేసారు. ఆయన బాటలో సుధీర్ రెడ్డి కి అవకాశం ఉందని అంటున్నారు.

# ఎన్ఎండి ఫరూక్ ను సత్కరించిన నంద్యాల ఐఎంఏ



– విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 07–నంద్యాల శాసనసభ్యులుగా ఘన విజయం సాధించిన మాజీ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ను ఐఎంఏ నంద్యాల సభ్యులు శాలువా, గజ మాల, జ్ఞాపిక లతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ గుర్రాల రవి కృష్ణ, తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ వైద్యుల విభాగం అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, నంద్యాల జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ సాయి కృష్ణ, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఖలీల్ సొహెల్ ,డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శరత్ కుమార్,డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, డాక్టర్ నీలా ప్రసాద్, డాక్టర్ గెలివి సిద్ధార్థ, డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మదా, డాక్టర్ షబ్నం, డాక్టర్ హరిత, డాక్టర్ శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల ఎమ్మెల్యే ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల వైద్యులు మంచి నైపుణ్యంతో వైద్యాన్ని అందిస్తున్నారని, సేవాభావం కలిగి ఉన్నారని అభినందించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ వైద్య సమావేశాల కోసం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ కోసం భవనాన్ని కట్టడానికి స్థలం కేటాయించమని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఫరూక్ స్పందిస్తూ అధికారులతో చర్చించి స్థలం కేటాయించడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# పారిశుధ్యం పై పర్యవేక్షణ



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 07–ఎన్జీవో కాలనీలో శుక్రవారం డ్రైనేజీ శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పరిశీలించారు . పలు కాలనీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. మంచినీటి సరఫరా, మురిగు కాల్వల్లో పూడిక తొలగింపు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని కమిషనర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కార చర్యలు చేపడుతామన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి , సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# 48గంటల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న... కోట్ల

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–జూన్ 7 ఎన్నికల ప్రచారం లో భాగంగా కొత్తబురుజు గ్రామం లో త్రాగునీటి సమస్య ను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీలో భాగంగా కొత్తబురుజు గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తానని గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీని కేవలం 48 గంటల్లో పరిష్కరించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి. గ్రామం లోని త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక తెలుగుదేశం నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త తూర్పు లింగారెడ్డి ని కోట్ల సంప్రదించగా...సమాజ సేవతో నిత్యం ప్రజలకు దగ్గరవుతూ ప్రజల మన్ననలు పొందుతూ ఉండే తూర్పు లింగారెడ్డి కొత్తబురుజు గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా త్రాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని బోరు బావిని వేయించి కొత్తబురుజు గ్రామ ప్రజల తాగునీటి సమస్యను తీర్చారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ కోట్ల సూరప్రకాష్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని, గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటారని,ఎవరికైనా ఏదైనా కష్టం వస్తే ఆదుకోవడానికి దేవుడు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో తనకు అవకాశం కల్పించాడని సమాజ సేవలోనే తనకు సంతృప్తి ఉందని అయన అన్నారు. కోట్ల ఆశీస్సులతో భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి పనులు చేయడానికి అన్ని విధాలుగా తాను ముందు ఉంటానని గ్రామ ప్రజలకు తెలియజేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించడంతో కొత్త బురుజు గ్రామ ప్రజల ఆనందానికి అంతులేకుండా పోయింది.



# ఆయుష్ యోగా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఫరూక్ కు ఘన సన్మానం



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 07–ఆయుష్ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఆయుష్ యోగ గురువు ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి కార్యాలయంలో నంద్యాల ఎమ్మెల్యే ఫరూక్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో టిడిపి నాయకులు, కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్, మాజీ కౌన్సిలర్ ఎలిశెట్టి హరినాథ్, న్యాయవాది అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ ఎటువంటి భేషజాలకు పోకుండా సాదా సీదాగా ఉండే వ్యక్తి ఫరూక్ అని, ఎన్ని ఉన్నత పదవులు అలంకరించినా ఒక మామూలు నాయకుడిలాగే ఉండడం ఆయనకే చెల్లిందన్నారు. ఆయన తన సొంత ఆస్తులను నంద్యాల అభివృద్ధికి ఇవ్వడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఫరూక్ మంత్రిగా ఎదిగి నంద్యాల అభివృద్ధికి కృషి చేస్తూ, తన పదవికి మరింత వన్నె తేవాలని కోరారు. అలాగే ఈనెల 21న యోగా డే సందర్భంగా ఆయుష్ యోగ కేంద్రాన్ని సందర్శించాలని కోరారు. ఎమ్మెల్యే ఫరూక్ మాట్లాడుతూ తనకు మద్దతిచ్చిన ఆనంద్ గురూజీ, కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్ లకు ధన్యవాదాలు తెలుపుతూ నంద్యాల ప్రజల సహకారం మరువలేనిదని, ప్రజలకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అలాగే తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, తన సేవలను వినియోగించుకోవాలని ఫరూక్ కోరారు. అనంతరం ఆనంద్ గురూజీ, కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్ ఆధ్వర్యంలో యోగ సభ్యులు ఫరూక్ ను ఘనంగా శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ గురూజీ సతీమణి సులోచన, యోగా సభ్యులు వసుమతి, నాగరాజు, ఆంజనేయులు, శీను, రాము, టీచర్ జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫరూక్ గారి గెలుపు కోసం కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

## --నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్



నంద్యాల ఎమ్మెల్యేగా ఎన్ఎండి ఫరూక్ గారిని భారీ మెజారిటీతో గెలిపించినందుకు నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మరియు అభిమానులకు కార్యకర్తలకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విజయం ప్రజలకు అంకితం అన్నారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయం నందు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు జనసేన నాయకులు పిడతల సుధాకర్, పబ్బతి రవి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషిచేసిన జనసేన నాయకులకు, జనసైనికులకు , బిజెపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల ప్రజలు ఈ విజయాన్ని ఇచ్చినందుకు అందరికీ ఎంతో రుణపడి ఉంటానని ప్రజల కష్టాలు తీర్చే నాయకుడులా పనిచేస్తామన్నారు . ఈరోజు నుంచి నంద్యాల నియోజకవర్గ సమస్యలపై దృష్టి సాధించి వాటిని తీర్చే విధంగా పనిచేస్తామన్నారు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం జనసేన నాయకులు పిడతల సుధాకర్, పబ్బతి రవి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ను గెలిపించిన పిఠాపురం ప్రజలకు నంద్యాల జనసేన పార్టీ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. నంద్యాల టిడిపి అసెంబ్లీ అభ్యర్థి ఫరూక్ కి, పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి గెలుపుకు కృషిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు.

# సామాజిక వర్గాల సమీకరణలో కర్నూలు యంపీ బస్తిపాటి నాగరాజు కి కేంద్రమంత్రి పదవి కేటాయించాలి.

కర్నూలు జిల్లాలో కురువలకు రాజకీయ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు.రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్.

సుంకన్న మదాసి కురువ.రాష్ట్ర అధ్యక్షులు.

మదాసికురువ/మదారికురువ హక్కుల పోరాట సమితి.



విభారే న్యూస్. జూన్ 7. కర్నూలు ప్రతినిధి :–రాష్ట్ర వ్యాప్తంగావున్న కురువ సామాజిక వర్గాన్ని గుర్తించి కర్నూలు జిల్లాలో కురువ సామాజిక వర్గానికి రాజకీయ అవకాశాలను కల్పించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు సామాజికవర్గ సమీకరణలో భాగంగా రాజకీయంగా వెనుకబడిన కురువ సామాజిక వర్గానికి చెందిన కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి(పంచలింగాల)నాగరాజు గారికి కేంద్రమంత్రి పదవులలో అవకాశం కల్పించాలని రాయల సీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయులసీమ రవికుమార్, మదాసి,మదారి కురువ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న మదాసి కురువ విజ్ఞప్తి .ఈ సందర్భంగా కర్నూలు నగరంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయంలో వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా కర్నూలు జిల్లాలో రాజకీయంగా అణగారిన సామాజిక వర్గమైన కురువలను గుర్తించి కర్నూలు యంపీ స్థానాన్ని కేటాయించిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కురువలకు మరోసారి రాజకీయ భవిష్యత్తును ఇచ్చారని,బడుగు బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీకి అని మరోసారి రుజువు చేసారన్నారు.తెలుగుదేశం పార్టీ కురువ సామాజిక వర్గానికి ఇచ్చిన అవకాశాన్ని,నమ్మకాన్ని కురువలు వమ్ముచేయలేదని జిల్లాలోని కురువలు సాటీ సోదర సామాజిక వర్గాలను,కులాలను కలుపుకుని వారి సంపూర్ణ సహకారంతో లక్షా పదకొండువేలకు పైగా మెజారిటీతో తెలుగుదేశం పార్టీ కర్నూలు యంపీ స్థానంలో బస్తిపాటి నాగరాజు ని గెలిపించుకోగలిగారని అన్నారు.ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకీ కేంద్రంలో సైతం ప్రాధానపాత్ర పోషించే అవకాశం ఉన్నందున దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కురువ సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్త,సౌమ్యుడు,ప్రజానాయకుడు,అత్యంత సామాన్యుడైన కర్నూలు యంపీ బస్తిపాటి(పంచలింగాల)నాగరాజు కి కేంద్రమంత్రి పదవులలో అవకాశం కల్పించి ఆశీర్వదించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కర్నూలు జిల్లా అధ్యక్షులు అశోక్ కురువ గోవిందు,కురువ కృష్ణయ్య,కురువ పరమేష్,కురువ మల్లేష్,కురువ మల్లికార్జున,కురువ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కోడుమూరుఅసెంబ్లీలో ఎన్డీయే నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదములు :- వేల్పులగోపాల్



విభారే న్యూస్. జూన్ 7.కర్నూల్ ప్రతినిధిభారతీయ జనతా పార్టీ కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ నగరంలో కోడుమూరు అసెంబ్లీ కోకన్వీనర్ వేల్పులగోపాల్ మాట్లాడుతూ 2024 లో జరిగినటువంటి సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక మెజార్టీతో గెలిచి అలాగే కర్నూలు జిల్లాలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి దగ్గుబాటిపురందేశ్వరి ఆదేశాలతో మన భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన అభివృద్ధి కర్నూలు పార్లమెంటులో దాదపుగా ఏడు స్థానాలకు గాను ఐదు స్థానాలు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలవగా వాటిలో ఆదోని అసెంబ్లీ నుండి ఎన్డీఏ బిజెపి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు అలాగే కోడుమూరు అసెంబ్లీలో ఎన్డీఏ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి గెలుపొందిన విషయం అందరికీ తెలిసిందే కానీ దాదపుగా కోడుమూరు అసెంబ్లీ ఏర్పడినప్పటి నుండి టిడిపి అభ్యర్థి ఒకసారి గెలుపొందారు మరలా ఆరుసార్లు ఎన్నికల రాగ ఇప్పుడు రెండవసారిగా గెలుపొందడం కోడుమూరు అసెంబ్లీలో ఉన్నటువంటి గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజలే పట్టం కట్టారు గనక ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలన్నీ చేరువ చేసి కచ్చితంగా ప్రజల కష్టాలు బొగ్గులదస్తగిరి తీరుస్తారని అన్నారు ఎన్డీఏ కూటమిలో భాగంగా భారతీయ జనతా పార్టీకి టిడిపి జనసేన రాష్ట్ర నాయకులకు జిల్లా నాయకులకు మండల నాయకులకు గ్రామ నాయకులకు అందరికీ మరొకసారి పేరుపేరునా ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు ఈకార్యక్రమంలో కోడుమూరు మండల అధ్యక్షుడు షణ్ముఖఅచారి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళినాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్చాలలక్ష్మణ్ నాయుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షలతో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు....డివైఎఫ్ఐ




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:–జూన్ 7 బంగారు భవిష్యత్తు గల యువకులు కలుషితమైన రాజకీయ ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని డివైఎఫ్ఐ డోన్ మండల అధ్యక్ష కార్యదర్శి , నక్కిహరి, హబీబ్ బాషా లు యువతకు పిలుపునిచ్చారు,ఈసందర్భంగా వారు మాట్లాడుతు మా పార్టీ అధికారం లో ఉందని యువత ప్రత్యర్థులపై దాడులకు దిగితే కేసులలో చిక్కుకొని జీవితం నాశనం చేసుకోవద్దని, మనపై మన తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని యువత కు విజ్ఞప్తి చేసారు.అధికారం అనేది ఏ రాజకీయ పార్టీలకు సొంతం కాదని అది ప్రజలు పెట్టిన బిక్షని యువత గుర్తించాలి, నాయకులు పూటకోక పార్టీలల్లో ఉంటారని పార్టీలు మారేకొద్దీ యువతను రాజకీయ నాయకులు తప్పుదోవ పట్టిస్తూ మద్యానికి బానిసలను చేస్తూ ప్రత్యర్థులపై దాడులకు ఉసుకొల్పుతున్నారు. అలాంటి వారిపై యువత అప్రమత్తంగా ఉండాలని, కేసులో చిక్కుకుంటే మీ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు.మిమ్మలని వాడుకునే నేతలు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో మీకే తెలియకుండా వారు రాజకీయంగా ఆర్థికంగా ఎదుగుతూ మీ జీవితలనే వారి ఎదుగుదలకు పునాదులుగు మలుచుకుంటున్నారని, అలాంటి రాజకీయ నాయకుల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని యువతకు విజ్ఞప్తి చేసారు.పోలీస్ అధికారులు సైతం అరాచక శక్తులపైన ప్రత్యేక నిఘా ఉంచి, పట్టణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డివైఎఫ్ఐ గా విజ్ఞాపి చేశారు. ఈ కార్యక్రమం లో డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు పవన్ కుమార్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం గడ్డా... బుడ్డా రాజశేఖర్ రెడ్డి అడ్డా.......

## నూర్ బేగ్ తెలుగుదేశం పార్టీ నాయకులు



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 07 – శ్రీశైలం నియోజకవర్గం ,ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం నాడు స్థానిక రఘునాథ్ సెంటర్లో నూర్ బేగ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు కార్యకర్తలు బాణాసంచాలు కాల్చి, కేక్ కట్ చేసి భారీ ఎత్తున సంబరాలు చేసుకున్నారు.శ్రీశైలం నియోజకవర్గంలో బుడ్డా రాజశేఖర్ రెడ్డి , రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు ఆత్మకూరు పట్టణంలో భారీ ర్యాలీగా బయలుదేరి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టిడిపి పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, శివ ప్రసాద్ రెడ్డి, నూర్ బేగ్, ఇబ్రహీం ఖలీలుల్లా, రేడియం నూర్, షాలి పైల్వాన్, పసిఫిల్ మున్నా, మోటర్ షఫీ, మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**